క్లుప్తంగా...

ఉచిత మెగా వైద్య శిబిరం



గోల్కొండ: రోటరీ క్లబ్ లాంటి సేవా సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఇతరులకు ఆదర్శం కావాలని సకీనా ఫౌండేషన్ చైర్మన్ ఆసిఫ్ హుస్సేన్ సోహెల్ అన్నారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ వారు షేక్‌పేట్‌లోని సూర్యనగర్ కాలనీలో ఫ్రీ హెల్త్ అండ్ కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంతో మంది పేద, మధ్య తరగతి వారికి వైద్యం ఇంకా అందని ద్రాక్షగానే ఉందని ఆయన అన్నారు. కేన్సర్ నేడు చాప కింద నీరులా మారిందని, వ్యాధి ముదిరే వరకు ఈ విషయంపై ఎవరికి తెలియకుండా పోతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సుమారు 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యులు రోటేరియన్ ఏజీ సురేష్, రోటరేయన్ డీజీఎస్ రాంప్రసాద్, గోల్కొండ, ఫిల్మ్‌నగర్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దాసోజు శ్రవణ్ నియామకాన్ని పునరాలోచించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ఉద్యమ సాధనలో ముందున్న దాసోజు శ్రవణ్ ఎమ్మెల్సీ నియామక ఫైల్‌ను గవర్నర్ తిప్పి పంపడం పట్ల తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం తీవ్రంగా ఖండించింది. సోమవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ..బడుగు బలహీన వర్గాలకు చెందిన రాజకీయ నేతలను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ అవమానించడం తగదన్నారు. దాసోజు శ్రవణ్ నియామకాన్ని గవర్నర్ పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లాల్‌కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



గోల్కొండ: జన సంఘ్ వ్యవస్థాపకుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. గుడిమల్కాపూర్‌లో జరిగిన ఈ జయంతి కార్యక్రమంలో బీజేపీ నాయకులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాంత్‌సాగర్, దేవర వంశీ, శివరాజ్‌యాదవ్, ప్రభు పూజారి, అశ్విన్‌మోదీ, నాగరాజు, అనిల్ తదితరులున్నారు.

గుండెపోటుతో సెంట్రల్ వక్ఫ్ మాజీ కౌన్సిల్ మెంబర్ మృతి



హనీఫ్ అలీ (ఫైల్)

డబీర్‌పురా: మాజీ సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ మెంబర్, బీజేపీ సీనియర్ నాయకుడు హనీఫ్ అలీ సోమవారం తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. కట్టెలగూడ ప్రాంతానికి చెందిన హనీఫ్ అలీ (58) కొన్నేళ్లుగా బీజేపీలో కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లో హనీఫ్ అలీ బహదూర్‌పురా నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. సోమవారం తన నివాసంలో ఉన్న సమయంలో హనీఫ్ అలీకి గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

సంతాపం తెలిపిన బండారు దత్తాత్రేయ..

సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సభ్యులు, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు హనీఫ్ అలీ మృతి పట్ల హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. హనీఫ్ అలీ మృతి తనకు తీవ్రంగా కలిగించిందని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. హనీఫ్ అలీ జాతీయ భావాలతో దేశ హితం కోసం పని చేసిన మైనార్టీ నాయకులని..30 ఏళ్లుగా పాతబస్తీలోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మైనార్టీల సమస్యలు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అనేక ఉద్యమాలు చేశారన్నారు.

కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల ప్రచారం



నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రచారం చేస్తున్న సంఘ్ నేతలు

నాంపల్లి: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల ప్రచారం విస్తృతంగా కొనసాగుతోంది. అక్టోబరు 10న సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని హెడ్ క్వార్టర్స్‌లో, 12న బయటి స్టేషన్స్‌లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ అధ్యక్షుడు ఎస్వీఎస్ చౌదరి ఆధ్వర్యంలో నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. వివిధ శాఖలకు చెందిన కార్మికులను కలిసి సంఘ్ అభ్యర్థి వేగి మురళీకృష్ణ ప్యానల్‌ను గెలిపించాలని ఎస్వీఎస్ చౌదరి కోరారు. హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ నారాయణ, సంఘ్ నేతలు శ్రీనివాస్, నాగరాజు ప్రసాద్, రామరాజు, జలీల్ అహ్మద్, సత్య కుమార్‌రెడ్డి, సీహెచ్. శ్రీనివాస్, నరసింహారావు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..



శివ్‌బాగ్ కాలనీలో.. బీజేపీ డైరీసెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్



ఇంద్రనగర్‌లో: సినీనటి మాధురి దిపాంకర్, జీవన్‌సింగ్ తదితరులు

గణేష్ నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. భక్తులు సోమవారం గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నేతలు గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



మల్లేపల్లిలో.. పాండు ముదిరాజ్, అజయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో..



ఫతేసుల్తాన్ లేన్‌లో.. గోవర్ధన్, జశ్వంత్, అభినవ్



హిందీనగర్‌లో.. దీపక్ అగర్వాల్, సతీష్‌కుమార్



మహేష్‌నగర్ కాలనీ-2లో..



గోషామహల్ వద్ద..



గోషామహల్‌లో యోగేష్ యాదవ్ గణనాథునికి ఎమ్మెల్సీ దయానంద్, ధన్‌రాజ్ పూజలు



పూజల్లో బీజేపీ నాయకుడు అమర్‌సింగ్



గోల్కొండ బంజారా దర్వాజాలో..



బాంజవాడిలో.. బీజేపీ నాయకుడు సంతోష్ సింగ్



ఇబ్రహింబాగ్‌లో.. రాజువస్తాద్, గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్



గుడిమల్కాపూర్‌లో.. దేవర శ్రీనివాస్ తదితరులు



విజయనగర్‌కాలనీలో..



పూజల్లో టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి



ఏసీపీ వెంకన్న నాయక్, సయ్యద్ సమీఉద్దీన్



కోట్ల అలీజాలో గాజుల అంజయ్య, బాబురాజా



హనుమాన్‌నగర్-3 వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



దేవీనగర్‌లో.. బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్



గణేష్ బంప్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



యాకుత్‌పురాలో..



మెహిదీపట్నం పంచవటి కాలనీలోని గణనాథుడి వద్ద శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ నవయువక్ సంఘ్ ఆధ్వర్యంలో పూజలు



కుత్బిగూడలోని శ్రీనల్లపోచమ్మ ఆలయంలో...

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీ కండువాలు కప్పిన కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ

జియాగూడ: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కారణంగా ఎన్నో సమాజ్‌లు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నాయని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. సోమవారం జియాగూడ బీఆర్ఎస్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి అధ్యక్షతన ఎస్సీసెల్ అధ్యక్షులు రఘునాథ్ సూర్యవంశీ ఆధ్వర్యంలో జియాగూడ, భీమ్‌నగర్, ఇక్బాల్‌గంజ్ ప్రాంతాలకు చెందిన మోచీ సమాజ్ మహిళలు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మిత్రకృష్ణ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడల మోహన్ మంగి కిశోర్ కుమార్, పాలెం వెంకటేష్, అనిల్, గణేష్, ఆనంద్, సంజు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో గృహిణి అదృశ్యం



హీనా రయీస్ (ఫైల్)



అలేజే నూరీన్, మహ్మద్ ఫర్హాన్ (ఫైల్)

గౌలిపురా: ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ గృహిణి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సద్దాం, హీనా రయీస్ (30) దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు అలేజే నూరీన్ (9), మహ్మద్ ఫర్హాన్ (4). ఈనెల 20న హీనా రయీస్ ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన మహ్మద్ సద్దాం స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భార్య, పిల్లలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న మీర్‌చౌక్, రెయిన్‌బజార్, ఆర్ఏఎఫ్ బలగాలు

డబీర్‌పురా: వినాయక నిమజ్జనోత్సవాలను పురస్కరించుకొని మీర్‌చౌక్, రెయిన్‌బజార్ పోలీసులు ర్యాపిడ్‌ యాక్షన్ ఫోర్స్ బలగాలతో స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఉత్సవాల నేపథ్యంలో ప్రజలకు మేమున్నామంటూ భరోసా కల్పించేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు. మీర్‌చౌక్ పీఎస్ పరిధిలోని దారుషిఫా, నూర్‌ఖాన్‌బజార్, సెంట్రల్ బ్యాంక్, బోదేఅలీషా కిడికి, కోమటివాడి, డబీర్‌పురా దర్వాజా వరకు, అదే విధంగా రెయిన్‌బజార్ పీఎస్ పరిధిలోని గంగానగర్ నాలా, రెయిన్‌బజార్ పీఎస్, జాఫర్ రోడ్డు, సోమనాథ్ ఆలయం మీదుగా తలాబ్‌కట్టా వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీర్‌చౌక్, రెయిన్ బజార్ పోలీసులు పాల్గొన్నారు.

వాంబే గృహాల పైకప్పు కూలి గృహిణికి గాయాలు



గాయపడిన దేవిక

నాంపల్లి: వాంబే గృహాల ఇంటి పైకప్పు కూలి గృహిణికి గాయాలయ్యాయి. తలకు బలమైన గాయాలు కావడంతో ఆమెను స్థానికులు నాంపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అఫ్జల్‌సాగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాంపల్లిలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం పక్కన ఉండే భీమ్‌రావ్‌బాడా బాధితులను 2007లో అఫ్జల్‌సాగర్ ధోబీఘాట్‌లో నిర్మించిన వాంబే గృహాల్లోకి తరలించారు. బ్లాక్ నెం-4, ప్లాట్ నెం-29ఎస్‌లో దాసరి శివరామ్ ప్రసాద్ కుటుంబం నివాసం ఉంటోంది. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో దాసరి శివరామ్ ప్రసాద్ భార్య దాసరి దేవిక(35) ఇంట్లో వంట చేసుకుంటుండగా పైకప్పు ఒక్కసారిగా కూలింది. కూలిన పైకప్పు ఆమె తలపై పడింది. దీంతో ఒక్కసారిగా ఆమె కింద కుప్పకూలిపోయారు. ఇంట్లో నుంచి ఒక్కసారిగా పెద్దపెట్టున కేకలు వినిపించడంతో ఇరుగుపొరుగు వారు గమనించి ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. వైద్యులు తలకు ఎనిమిది కుట్లు వేసి బాధితురాలిని డిశ్చార్జ్ చేశారు. సమాచారం అందుకున్న నాంపల్లి రెవెన్యూ అధికారులు, హబీబ్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



పెచ్చులూడి కిందపడిన దృశ్యం

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

విజయనగర్ కాలనీ: గుడిమల్కాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని బీజేపీ నాయకుడు దేవర వంశీ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. సోమవారం ఆయనను కలిసి డివిజన్‌లో చేపట్టాల్సిన పనులపై మంత్రికి వివరించారు. వర్షం పడితే పేదల బస్తీల్లో ఎక్కడపడితే అక్కడ వర్షం నీరు ఆగిపోతుందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కిషన్‌రెడ్డి స్పందించి వివిధ రకాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామన్నారు. తాను స్వయంగా గుడిమల్కాపూర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు.



కిషన్‌రెడ్డికి గుడిమల్కాపూర్ సమస్యలు వివరిస్తున్న దేవర వంశీ

రక్తదానం ప్రాణదానంతో సమానం



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

అబిడ్స్: రక్తదానం ప్రాణదానంతో సమానమని మజ్లిస్ పార్టీ నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ పేర్కొన్నారు. టీఎస్‌సీఎస్ అధ్యక్షుడు చంద్రకాంత్ అగర్వాల్, జాయింట్ సెక్రెటరి అలీమ్‌బేగ్ ఆధ్వర్యంలో హజ్ హౌస్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి మానవుడు జీవితంలో కొన్నిసార్లు అయినా రక్తదానం చేయాలని సూచించారు. సమాజానికి సేవచేయడంలో రక్తదానం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అహ్సన్‌అల్ హమూమీ, ఫోకస్ ఇర్షాదుల్, మోహిన్ అలీ, డాక్టర్ మహ్మద్ ముస్తఫా అలీ, అబు అల్మల్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలికలను బాలల సంరక్షణ కేంద్రంలో అప్పగింత



సంతోష్‌నగర్: వృద్ధురాలైన నాయనమ్మ సూచన మేరకు ఇద్దరు బాలికలను సోమవారం సంతోష్‌నగర్ పోలీసులు జిల్లా బాలల సంరక్షణ కేంద్రంలో అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర తెలిపిన వివరాల ప్రకారం..రక్షాపురం కాలనీకి చెందిన సుధాకర్ కూతుళ్లు బి.అక్షిత (8), బి.పూర్వీక (7) కొన్నేళ్లుగా వృద్ధురాలైన నాయనమ్మ యాదమ్మ వద్ద ఉంటున్నారు. అక్షిత, పూర్వీక తల్లిదండ్రులు ఇద్దరు మద్యానికి బానిసై పిల్లలను పట్టించుకోకుండా ఆరేళ్ల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి..ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో ఇద్దరు పిల్లలు నాయనమ్మ వద్ద ఉంటున్నారు. వృద్ధురాలైన యాదమ్మ వారి ఆలన పాలన చూసుకోవడానికి కష్టమవుతుండటంతో సంతోష్‌నగర్ పోలీసులకు తెలిపింది. దీంతో యాదమ్మ సూచన మేరకు అక్షిత, పూర్వీకను సంతోష్‌నగర్ పోలీసులు లక్డీకపూల్‌లోని జిల్లా బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు.